సాక్షి
శ్రీకాకుళం


గురువారం । 17 । జూలై । 2025



ఇదేం తీరు..?
వైద్యారోగ్య శాఖలో బదిలీలపై అసహనం వ్యక్తమవుతోంది. ఎమ్మెల్యేలు పట్టు విడవడం లేదు. - 8లో



4 గంటల నరకం
ఎం.తోటూరు రైల్వే గేటు వద్ద ప్రయాణికులు నరకం చూశారు. నాలుగు గంటల పాటు అవస్థలు పడ్డారు. - 8లో



ఆన్‌లైన్ గేమ్స్‌లో నష్టపోయి..
ఆన్‌లైన్ గేమ్స్ మరో ప్రాణాన్ని బలికొన్నాయి. తీవ్రంగా నష్టపోవడంతో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డారు. - 8లో

న్యూస్‌రీల్

రేపటి నుంచి గ్రామసభలు: కలెక్టర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: పేదరిక నిర్మూలనే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పీ–4 కార్యక్రమం విజయవంతం చేయాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పిలుపునిచ్చారు. స్వర్ణాంధ్ర విజన్–2047లో భాగంగా జిల్లాలో చేపట్టిన ఈ కార్యక్రమంపై కలెక్టర్ కార్యాలయంలో బుధవారం జరిగిన శిక్షణ సదస్సులో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రణాళికా సంఘం కన్సల్టెంట్ బి.బలరాం బంగారు కుటుంబాల ఎంపిక, దత్తత విధానాలపై అధికారులకు వివరించారు. జిల్లాలో ఇప్పటివరకు గుర్తించిన 75,566 బంగారు కుటుంబాల్లో కేవలం 9,494 కుటుంబాలు మాత్రమే దత్తతకు ఎంపికయ్యాయని తెలిపారు. ఆగస్టు 15 నాటికి దత్తత ప్రక్రియ పూర్తి కావాలని సూచించారు. బంగారు కుటుంబాల తుది జాబితా తయారీకి జూలై 18 నుంచి 25లోగా గ్రామ, వార్డు సభలు నిర్వహించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. 'రూట్స్' యాప్ ద్వారా ప్రజల నుంచి వివరాలను సేకరించాలని సూచించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, అసిస్టెంట్ కలెక్టర్ దొనక పథ్విరాజ్ కుమార్, టెక్కలి ఆర్డీఓ కృష్ణమూర్తి పాల్గొన్నారు.

బీఈడీ నాలుగో సెమిస్టర్‌కు నోటిఫికేషన్ విడుదల

ఎచ్చెర్ల: బీఈడీ 4వ సెమిస్టర్‌కు సంబంధించి పరీక్ష షెడ్యూల్‌ను డీన్ ఉదయ భాస్కర్ బుధవారం విడుదల చేశారు. ఆగస్టు 19 నుంచి సెమిస్టర్ పరీక్షలు మొదలవుతాయని, 12లోగా ఫీజులు చెల్లించాలని తెలిపారు. పూర్తి వివరాలకు యూనివర్సిటీ వెబ్‌సైట్ చూడాలన్నారు.

'హైస్కూల్ ప్లస్ పాఠశాలల్లో ఖాళీలు భర్తీ చేయాలి'



టెక్కలిలో పాఠశాలను సందర్శించిన తమ్మినేని చందనరావు, ఇతర ప్రతినిధులు

టెక్కలి: హైస్కూల్ ప్లస్ పాఠశాలల్లో ఖాళీలను భర్తీ చేయాలని స్కూల్ టీచర్స్ అసోసియేషన్ (ఏపీ ఎస్టీఏ) రాష్ట్ర ప్రధానకార్యదర్శి తమ్మినేని చందనరావు డిమాండ్ చేశారు. బుధవారం టెక్కలి హైస్కూల్ ప్లస్ పాఠశాలను సందర్శించి అక్కడ సమస్యలను తెలుసుకున్నారు. హైస్కూల్ ప్లస్ పాఠశాలల్లో పీజీటీ పోస్టులు ఖాళీలు ఏర్పడుతున్నాయని, తక్షణమే వాటిని ప్రభుత్వం భర్తీ చేయాలన్నారు. ప్రస్తుతం ఇంటర్ విద్యార్థులకు పాఠాలు బోధించే ఉపాధ్యాయులు లేకపోవడం వల్ల అభద్రతా భావానికి గురవుతున్నారని అన్నారు. ఆయనతో పాటు జిల్లా జాయింట్ సెక్రటరీ కె.కోదండరామిరెడ్డి, కేవీ రమణ, శ్రీధర్, మోహనరావు, అసిరినాయుడు తదితరులు పాల్గొన్నారు.

బోధనేతర పనుల నుంచి విముక్తి ఎప్పుడు?

శ్రీకాకుళం న్యూకాలనీ: బోధనేతర పనుల నుంచి ఉపాధ్యాయులకు విముక్తి కలిగించాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ రమణమూర్తి, ప్రధాన కార్యదర్శి గురుగుబెల్లి రమణ కోరారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రభుత్వ పాఠశాల మూతవేతే లక్ష్యంగా పాలకులు ముందుకు సాగుతుండటం బాధాకరమన్నారు. ఉపాధ్యాయులను తరగతులకు దూరం చేస్తూ అనునిత్యం బోధన అభ్యసనకు ఆటంకం కలిగించే కార్యక్రమాలు పాఠశాలలో నిర్వహిస్తుండటం ఇటీవల పరిపాటిగా మారిందన్నారు. బడుగు బలహీన వర్గాల పిల్లలకు ప్రభుత్వం అన్యాయం చేస్తోందన్నారు. ఉపాధ్యాయుడిని బోధనకు దూరం చేసి.. ఇతర కార్యక్రమాల్లో నిమగ్నమయ్యేలా చేయడం గతంలో ఎన్నడూ లేదని, దీనికి ప్రత్యక్ష ఉదాహరణే తాజాగా జరిగిన మెగా పేరెంట్ సమావేశమని గుర్తుచేశారు. సమావేశం ముగిసి వారం రోజులు కావస్తున్నా.. ఆనాటి వీడియోలు, ఫొటోలు మరోసారి అప్‌లోడ్ చేయండంటూ వేధిస్తుండటం బాధాకరమన్నారు. హెచ్ఎంలు, ప్రిన్సిపాళ్లపై, ఉపాధ్యాయులపై ఒత్తిడి చేస్తూనే ఉండటంతో బోధన సరిగ్గా సాగడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. ఈ హంగామాలోపడి విద్యా మిత్ర కిట్లు అందజేయడంలో కూడా అధికారులు వైఫల్యం చెందారని ఆరోపించారు. తరగతి గదిలో ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఉపాధ్యాయుడు ఉత్తమ బోధకుడిగా ఉండేలా స్వేచ్ఛాపూరిత వాతావరణం కల్పించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

ఉక్కబోతతో ఉక్కిరిబిక్కిరి



జిల్లాలో ఎండలు మండిపోతున్నాయి. ఐదు రోజులుగా వడగాలులు ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. అడపాదడపా వానలు పడుతున్నప్పటికీ ఎండలు మాత్రం విపరీతంగా కాస్తున్నాయి. మరో రెండు మూడు రోజుల పాటు ఇదే పరిస్థితి ఉంటుందని వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నా రు. వేసవిని తలపించేలా ఎండలు ఉండటంతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. వేసవిలో అత్యధికంగా 43 డిగ్రీలు సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైతే ఇప్పుడు 40 నుంచి 42 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదవుతోంది. దీనికి తోడు గాలులు లేకపోవడంతో జనం అల్లాడుతున్నారు. ముఖ్యంగా వృద్ధులు, చిన్నపిల్లల పరిస్థితి దయనీయంగా ఉంది. ఒకపక్క ఎండలు కాస్తుండగా సాయంత్రం 6 గంటల తర్వాత వాతావరణంలో ఒక్కో రోజు ఒక్కో విధమైన మార్పు కనిపిస్తోంది. ఈ వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో ప్రజలు జాగ్రత్తలు పాటించాలని వైద్యులు సూచిస్తున్నారు. బయటకు వెళ్లవద్దని, ద్రవపదార్థాలు ఎక్కువగా తీసుకోవాలని వృద్ధులు చిన్నపిల్లలు మరింత జాగ్రత్తగా ఉండాలని సూచిస్తున్నారు. -శ్రీకాకుళం

ఇదేం నిర్వాకం.?

- చదువుకుంటున్న పిల్లలు చనిపోయినట్లు ఆన్‌లైన్‌లో నమోదు చేసిన వైనం
- సచివాలయ సిబ్బంది నిర్లక్ష్యం
- ఇద్దరికీ అందని 'తల్లికి వందనం'

చక్కగా బడిలో చదువుకుంటున్న ఇద్దరు పిల్లలు చనిపోయార ని సచివాలయ సిబ్బంది ఆన్‌లైన్‌లో తప్పుగా నమోదు చేశారు. ఫలితంగా వారిద్దరూ తల్లికి వందనంకు దూరమయ్యారు. మెళియాపుట్టికి చెందిన మూగి భాస్కరరావు, కృష్ణవేణిల కుమారులు మూగి మోక్షిత్, మూగి షారుఖ్ ఓ ప్రైవేటు స్కూల్‌లో చదువుతున్నారు. వీరికి తల్లికి వందనం డబ్బులు పడలేదు. ఎందుకా అని ఆరా తీస్తే.. హౌస్ హోల్డ్ సర్వేలో అధికారులు వారిద్దరూ చనిపోయినట్లు ఆన్‌లైన్‌లో నమోదు చేసినట్లు తెలిసింది. ఈ విషయం తెలిసి తల్లిదండ్రులు నిశ్చేష్టులయ్యారు. గతంలో వైఎస్ జగన్ ఉన్నప్పుడు అమ్మ ఒడి వచ్చిందని, ఈ సారి కూడా అలాగే వస్తుందని ధీమాగా ఉన్నామని, కానీ అధికారుల తప్పిదం వల్ల ఇద్దరు పిల్లలు పథకానికి దూరమయ్యారని వారు తెలిపారు. విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని పేర్కొన్నారు. -మెళియాపుట్టి



ఆన్‌లైన్‌లో చనిపోయినట్లు నమోదైన దృశ్యం

'పీఎం సూర్యఘర్ సద్వినియోగం చేసుకోండి'



ప్రధానమంత్రి సూర్యఘర్ కార్యక్రమానికి విశేష స్పందన వస్తోందని, ఇంకా జిల్లాలో లక్ష్యాలను పూర్తి చేయాలని తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ ఫైనాన్స్ డైరెక్టర్ డి.చంద్రం ఆదేశించారు. ఆయన బుధవారం జిల్లా పర్యటనకు వచ్చిన సందర్భంగా సూర్యఘర్‌పై సోలార్ ప్యానెల్ కాంట్రాక్టర్లు, వెండర్లు, బ్యాంకు అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా పలు సూచనలను చేశారు. సోలార్‌తో విద్యుత్‌ను ఆదా చేసుకోవచ్చునని గృహ వినియోగదారులతో పాటు వాణిజ్య వినియోగదారులు కూడా సూర్యఘర్ పథకాన్ని నాణ్యమైన విద్యుత్‌తో పాటు బ్యాంకు సబ్సిడీలతో సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సర్కిల్ ఎస్ఈ నాగిరెడ్డి కృష్ణమూర్తి, ఆపరేషన్స్ ఈఈ పైడి యోగేశ్వరరావు, టెక్నికల్ ఈఈ సురేష్‌కుమార్ పాల్గొన్నారు. - అరసవల్లి

శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్





బాబు మార్క్ సంపద సృష్టి

ప్రైవేటుకు ఆర్టీసీ ఆస్తి



- అభివృద్ధి చేసి నిర్వహించుకునేలా ప్రైవేటు సంస్థకు అప్పగింత
- వచ్చే ఆదాయమంతా వారికే..
- ఆ దిశగా అడుగులు వేస్తున్న కూటమి ప్రభుత్వం
- పీపీపీ విధానంలో ఒప్పందానికి సిద్ధం
- కావాల్సిన వారు ముందుకొస్తే మరి కొన్ని ప్రభుత్వ ఆస్తులు ధారాదత్తం చేసే యోచన

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం:

'సంపద సృష్టిస్తా.. రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తా'.. అని చంద్రబాబు రాష్ట్రమంతా తిరిగి చెప్పారు. ఇప్పుడా సంపద సృష్టికి ఏకంగా ప్రభుత్వ ఆస్తులను ప్రైవేటు సంస్థలకు అప్పగించేస్తున్నారు. పైగా వచ్చే ఆదాయమంతా వారికి ఇవ్వడమే వింతగా కనిపిస్తోంది. ప్రైవేటు సంస్థలు సిద్ధంగా ఉంటే చాలు ఎంతటి విలువైన ప్రభుత్వ ఆస్తులనైనా ధారాదత్తం చేసేందుకు సిద్ధంగా ఉన్నారు. ఉన్న వాటిని కూలగొట్టి, పీపీపీ(పబ్లిక్ ప్రైవేటు పార్టనర్‌షిప్)విధానంలో ప్రైవేటు రంగ సంస్థలకు, వ్యక్తులకు అప్పగించాలన్నదే కూటమి ప్రభుత్వం విధానమని స్పష్టమవుతోంది. ప్రస్తుతం జిల్లా కేంద్రమైన శ్రీకాకుళంలోని ప్రధాన ప్రభుత్వ ఆస్తులపై సర్కారు కన్నుపడింది. తాజాగా ఆ జాబితాలోకి ఆర్టీసీ కాంప్లెక్స్ చేరింది. ప్రైవేటుకు చట్టపరమైన అనుమతులు కల్పించడమే పీపీపీ పద్ధతిలో జరగబోయే సిక్కోలు అభివృద్ధిగా చూపించాలని చూస్తోంది.

ప్రైవేటు చేతుల్లోకి ఆర్టీసీ కాంప్లెక్స్..

శ్రీకాకుళం నడిబొడ్డున, విలువైన స్థలంలో ఆర్టీసీ కాంప్లెక్స్ ఉంది. దాదాపు 16.50 ఎకరాల విస్తీర్ణంలో డిపోతో సహా ఉంది. ఒక్క కాంప్లెక్సే 6.50 ఎకరాల విస్తీర్ణంలో ఉంది. ఒకటో డిపో గ్యారేజీ 5.50ఎకరాలు, రెండో డిపో గ్యారేజీ 4.50 ఎకరాల విస్తీర్ణంలో ఉన్నాయి. ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో 69 షాపులు ప్రస్తుతం ఉన్నాయి. వాటిలో 9 తొమ్మిది షాపులు మాత్రమే ఖాళీగా ఉన్నాయి. మిగతావన్నీ ఆక్యుపెన్సీలో ఉన్నాయి. వీటి ద్వారా నెల వారీ అద్దెగా రూ.12,93,421 ఆదాయం వస్తోంది. ఇంతటి విలువైన, భారీగా నెల వారీ ఆదాయం వచ్చే ఆర్టీసీ కాంప్లెక్స్‌ను ప్రైవేటు సంస్థకు అప్పగించేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. ఇప్పటికే ఓ ప్రైవేటు సంస్థ ప్రతినిధులు, ఆర్టీసీ అధికారులు వచ్చి పరిశీలన కూడా చేశారు. పబ్లిక్ ప్రైవేటు పార్టనర్‌షిప్(పీపీపీ) విధానంలో ఆ సంస్థకు ఆర్టీసీ కాంప్లెక్స్ అప్పగిస్తే, వారంతా పునర్నిర్మాణం చేపట్టి, తద్వారా నిర్వహణ బాధ్యతలు తీసుకుని, దాని ద్వారా వచ్చే ఆదాయం ఆ సంస్థే పొందేలా ఒప్పందం చేసుకోవడానికి రంగం సిద్ధమవుతోంది. ప్రస్తుతం కలెక్టరేట్‌లో దానికి సంబంధించిన ఫైలు ప్రాసెస్‌లో ఉంది. ఏ క్షణంలోనైనా ఒప్పందం జరగనుంది. ఆ తర్వాత ప్రైవేటు సంస్థ చేతికి ఆర్టీసీ కాంప్లెక్స్ వెళ్లిపోతుంది.

బాబుకు అలవాటైన పనే..

ప్రభుత్వ ఆస్తులను ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టడమనేది చంద్రబాబు నైజం. తాను అధికారంలోకి వచ్చిన ప్రతి సారీ ప్రభుత్వ ఆస్తులను, సంస్థలను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించడం అలవాటు. ఇప్పుడదే జరుగుతోంది. తెరవెనక మంతనాలు, ఒప్పందాలు, నేతలకొచ్చే స్వప్రయోజనాలు పక్కన పెడితే ప్రభుత్వ ఆస్తులు కాస్త ప్రైవేటు సంస్థలు, వ్యక్తుల ఆధీనంలోకి వెళ్లనున్నాయి. ఒక్క ఆర్టీసీ కాంప్లెక్సే కాదు కావాల్సిన సంస్థలు ముందుకొస్తే నగరంలోని అనేక ప్రభుత్వ సంస్థలు, ఆస్తులు ఇచ్చేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధంగా ఉంది. ఆర్టీసీ కాంప్లెక్స్ తరహాలోనే జిల్లా కేంద్ర గ్రంథాలయం కూడా అప్పగించేందుకు సిద్ధమవుతోంది. ముమ్ముందు శ్రీకాకుళం నగరంలోని మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం, పొట్టి శ్రీరాముల మార్కెట్, బాపూజీ కళా మందిర్, పెద్దపాడు చెరువు స్థలం తదితర వాటిని కూడా పీపీపీ విధానంలో అప్పగించాలని యోచిస్తోంది. ఆ దిశగా అడుగులు కూడా వేస్తోంది. అదే జరిగితే నగరంలోని ప్రధాన ప్రభుత్వ ఆస్తులు, ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి వెళ్లి, వాటి ద్వారా వచ్చే ఆదాయాన్ని ప్రభుత్వం కోల్పోనుంది. అంతేకాకుండా యూజర్ చార్జీల పేరుతో పీపీపీ విధానంలో తీసుకున్న సంస్థలు ప్రజలపై భారం మోపే అవకాశం కూడా లేకపోలేదు.

కాశీబుగ్గ పోలీస్‌స్టేషన్ వద్ద ఉద్రిక్తత

- వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై పోలీసుల తీరును నిరసిస్తూ మాజీ మంత్రి సీదిరి ధర్నా



కాశీబుగ్గ పోలీసు స్టేషన్ ముందు బైఠాయించి నిరసన తెలుపుతున్న మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు

కాశీబుగ్గ: కాశీబుగ్గ పోలీస్ స్టేషన్ వద్ద బుధవారం ఉద్రిక్తత చోటుచేసుకుంది. పోలీసుల తీరును నిరసిస్తూ మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు స్టేషన్ ఎదుటే వైఎస్సార్ సీపీ నాయకులతో కలిసి ధర్నా చేశారు. మంగళవారం రాత్రి చిన్నబడాం గ్రామంలో నలుగురు టీడీపీ నాయకులు వైఎస్సార్ సీపీ కార్యకర్త కొవ్వూరు సుబ్బారావుపై దాడి చేశారు. ఆయన తక్షణమే ఆస్పత్రిలో చేరి పోలీసులకు ఫిర్యాదు చేస్తే కొట్లాటకు సంబంధం లేని ముగ్గురు వ్యక్తులను విచారణ పేరిట స్టేషన్‌కు రాత్రికి రాత్రే తీసుకువచ్చి విడిచిపెట్టకపోవడంపై మాజీ మంత్రి అసహనం వ్యక్తం చేశారు. బాధిత కుటుంబ సభ్యులు, వైఎస్సార్‌సీపీ నాయకులతో కలసి కాశీబుగ్గ సీఐ సూర్యనారాయణ, పోలీసులను నిలదీశారు. 7వ వార్డు చినబడాం కౌన్సిలర్ దువ్వాడ సత్యవతి భర్త రమణయ్యతో పాటు మరో ఇద్దరు ఎక్కడ ఉన్నారని ప్రశ్నించారు. విచారణ అనంతరం ఉదయాన్నే విడిచి పెడతామని చెప్పి ఎందుకు విడిచిపెట్టలేదని ప్రశ్నించారు. గాయపడిన టీడీపీ కార్యకర్తలు ఫిర్యాదు చేయడంతో ముగ్గురిపై ఎఫ్ఐఆర్ నమోదు చేశామని పోలీసులు సర్దిచెప్పే ప్రయత్నం చేయడంతో అప్పలరాజుకు పోలీసులకు మధ్య మాటల యుద్ధం జరిగింది. తమ విధులకు ఆటంకం కలిగించవద్దని సీఐ పి.సూర్యనారాయణ, రూరల్ సీఐ తిరుపతి రావు కోరడంతో అప్పలరాజు బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలని లేకపోతే మళ్లీ వచ్చి ధర్నా చేస్తానని హెచ్చరించి వెనుదిరిగారు.

ఎస్పీ విచారణ చేపట్టాలి

పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ 07వవార్డు చిన్న బాడాం గ్రామంలో మంగళవారం జరిగిన కొత్తమ్మ తల్లి చల్లదనం ఉత్సవంలో కొట్లాట జరిగిందని, అందుకు సంబంధం లేని వ్యక్తులపై కేసులు పెట్టడంపై ఎస్పీ మహేశ్వర రెడ్డి విచారణ చేపట్టి బాధితులకు న్యాయం చేయాలని మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు కోరారు. తప్పు చేస్తే కేసులు నమోదు చేయాలని, గొడవకు సంబంధం లేని వారిపై కేసులు కట్టడం సరికాదని అన్నారు. సక్రమంగా ఉన్న గ్రామాల్లో గొడవలు సృష్టించవద్దని, సీఐ గారూ మీకు చేతులు ఎత్తి నమస్కరిస్తున్నానని అన్నారు. దాడి చేసిన వారి ఫిర్యాదులతో బాధితులపై కేసులు పెట్టడం ఏమిటని, ధర్మం ఎక్కడ ఉందని ప్రశ్నించారు. సీఐ సూర్యనారాయణ రాకతో స్నేహంగా ఉండే గ్రామాలు రెండు వర్గాలుగా విడిపోయాయన్నారు.

కాళ్లకు మొక్కుతామంటూ..



సీఐ సూర్యనారాయణ కాళ్లకు మొక్కుతున్న బాధిత మహిళలు

చినబడాంలో మంగళవారం రాత్రి జరిగిన కొట్లాటలో సంబంధం లేని వైఎస్సార్‌సీపీ నాయకులను తీసుకువచ్చి రాత్రంతా పోలీస్‌స్టేషన్‌లో ఉంచారు. దీంతో తమ కుటుంబ సభ్యులకు ఏమైందో తెలీక బాధిత కుటుంబాల మహిళలు కాశీబుగ్గ సీఐ సూర్యనారాయణ కాలు మొక్కారు. సక్రమంగా విచారణ చేపట్టి న్యాయం చేయాలని కన్నీళ్లు పెట్టుకున్నారు.

'మధ్యవర్తిత్వమే మేలు'



మధ్యవర్తిత్వంపై ర్యాలీ చేస్తున్న న్యాయమూర్తులు, న్యాయవాదులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: కక్షిదారుల సమస్యలను స్వచ్ఛందంగా, త్వరితగతిన, పరస్పర అంగీకారంతో పరిష్కరించుకునే అత్యుత్తమ మార్గం మధ్యవర్తిత్వమని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా అన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శ్రీకాకుళం బార్ అసోసియేషన్ హాల్‌లో నిర్వహించిన 'మధ్యవర్తిత్వంపై న్యాయ విజ్ఞాన సదస్సు'లో ఆయన ప్రసంగించారు. న్యాయస్థానం జోక్యం లేకుండా కక్షిదారుల మధ్య ఒప్పందం కుదురుతుందని, మధ్యవర్తి సూచనలతో షరతులు రూపొందించి, స్పష్టమైన ఒప్పంద పత్రాన్ని తయారు చేస్తారని, ఇది అంతరంగికమైన, స్నేహపూర్వక పరిష్కార విధానమని వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కోర్టు భవనం నుంచి డే అండ్ నైట్ కూడలి వరకు భారీగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం కరపత్రాలను పంపిణీ చేశారు.

గొట్టా.. బాగుపడేదెట్టా..?



గొట్టా బ్యారేజీ దిగువ ప్రాంతంలో ఉన్న పరిస్థితి ఇది. పూర్తిగా రాతికట్టు దెబ్బతింది. జడ్జి స్టోన్ యాప్రాన్, సీసీ బ్లాకులు ఇలా పూర్తిగా ధ్వంసమయ్యాయి. ఇది బ్యారేజీ మనుగడకే ప్రమాదమని నిపుణులు హెచ్చరిస్తున్నారు. కానీ కూటమి ప్రభుత్వంలో ఎలాంటి చలనం లేదు.



వంశధార ఎడమ ప్రధాన కాలువకు ఇటీవల పడిన గండి ఇది. ఈ నెల 2న కాలువలో నీరు విడిచిపెట్టగా తొలి ఐదు కిలోమీటర్ల పరిధిలోనే రెండు రోజుల వ్యవధిలో గండ్లు పడ్డాయి. ప్రధానంగా పిల్ల కాలువలకు అనుసంధానించే మదుముల వద్ద గండ్లు పడుతున్నాయి. ఒకటి కాదు, రెండు కాదు ఏకంగా 70 చోట్ల ఇదే పరిస్థితి ఉంది.

సాక్షి పరిశీలన

- ప్రమాదంలో గొట్టా బ్యారేజీ
- నీరు విడుదల చేసిన రెండురోజులకే గండ్లు
- మదుముల వద్ద కోతకు గురవుతున్న గట్లు
- తక్కువ నీటి సామర్థ్యాన్ని కూడా తట్టుకోలేకపోతున్న వైనం
- ఆందోళనలో రైతులు

హిరమండలం:

పాలకుల నిర్లక్ష్యం, అధికారుల నిస్సహాయత్వం కలగలిపి గొట్టా బ్యారేజీని ప్రమాదంలో పడేస్తున్నాయి. ఈ ఏడాది ఎలాంటి కార్యాచరణ లేకుండా ఈ నెల 2న ఎడమ ప్రధాన కాలువ నీటిని విడుదల చేశారు. అయితే శివారు ఆయకట్టుగా ఉన్న టెక్కలి, పలాస నియోజకవర్గాలకు నీరు చేరకుండా నే.. కాలువ ప్రారంభంలోనే రెండుచోట్ల గండి పడింది. మొన్న ఆ మధ్యన కురిసిన వర్షాలకు గొట్టా బ్యారేజీలో 1480 టీఎంసీల నీరును నిల్వ చేసినట్టు అధికారులు చెప్పారు. ఈ నెల 2న తొలి విడతగా 500 క్యూసెక్కుల నీటిని విడుదలచేశారు. 12మండలాల్లోని 398 గ్రామాల రైతులకు సంబంధించి 1,48,230 ఎకరాలకు సాగునీరు అందించాలి. ఇదే కాలువపై మరో 20 వరకూ ఎత్తిపోతల పథకాలున్నాయి. వీటి ద్వారా మరో 20 వేల ఎకరాలకు సాగునీరు అందాలి. 20 టీఎంసీలను తరలించి 1.53 లక్షల ఎకరాలను నీటిని అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. క్షేత్రస్థాయిలో బ్యారేజీ, కాలువల పరిస్థితి చూస్తుంటే అది సాధ్యమయ్యే పరిస్థితి కాదని తేలిపోయింది.



గొట్టా బ్యారేజీ వద్ద వంశధార ఎడమ ప్రధాన కాలువ హెడ్ రెగ్యులేటరీ వద్ద దుస్థితి ఇది. ఇలా నిత్యం గేట్లు లీకులకు గురవుతుంటాయి. అత్యవసర సమయాల్లో గేట్లు మూసివేసినా.. ఇలా కాలువలోకి నీరు పారుతూ ఉంటుంది. ఇటీవల కాలువకు గండి పడడంతో గేట్లు మూసి వేసి నీటి ప్రవాహాన్ని నిలిపివేయాలని భావించారు. కానీ లీకుల నీటితో గండ్ల వద్ద పునరుద్ధరణ పనులకు తీవ్ర అంతరాయం కలిగింది.

ప్రతిపాదనలు బుట్టదాఖలు

వాస్తవానికి 2013లో బ్యారేజీతో పాటు కాలువల నిర్వహణకు సంబంధించి సుమారు రూ.400 కోట్లు అవసరమని ప్రతిపాదనలు పంపించారు. ఆ తర్వాత టీడీపీ ప్రభుత్వం రాగా ఆ ప్రతిపాదనను బుట్టదాఖలు చేసింది. అనంతరం వచ్చిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మాత్రం ముందుగా గొట్టా బ్యారేజీలో ఎత్తిపోతల పథకం పూర్తిచేసి వంశధార ఫేజ్–2 రిజర్వాయర్‌కు నీరు మళ్లించాలని ప్రయత్నించింది. అందులో కొంత విజయం సాధించింది. అదే సమయంలో వంశధార జలాలను ఇచ్ఛాపురం, పలాస నియోజకవర్గాలకు తరలించగలిగింది. అటు తర్వాత గొట్టా బ్యారేజీ, కాలువలపై దృష్టిపెట్టింది. కానీ ఇంతలో ఎన్నికలు రావడం, కూటమి ప్రభుత్వం రావడం జరిగిపోయింది. కూటమి అధికారంలోకి వచ్చి ఏడాది అవుతున్నా ఇంతవరకూ గొట్టా బ్యారేజీకి రూపాయి ఖర్చు చేయలేదు. కనీసం నీటి విడుదల ముందు కూడా నిర్వహణకు సంబంధించి ఎలాంటి సన్నాహకాలు చేయలేదు. అందుకే నీటిని విడిచిపెట్టిన రెండురోజులకే కాలువల బేలతనం బయటపడింది. దీంతో ఖరీఫ్‌లో ఎలా ఉంటుందోనన్న ఆందోళనలో రైతులు ఉన్నారు.

భారీగా పెరిగిన అంచనా వ్యయం..

ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో గొట్టా బ్యారేజీతో పాటు కాలువల నిర్వహణకు రూ.1100 కోట్లు ఉండాలని అధికార వర్గాలు తేల్చిచెబుతున్నాయి. ముఖ్యంగా గొట్టా బ్యారేజీకి సంబంధించి గేట్లు పాడయ్యాయి. హెడ్ స్లూయిస్‌కు సంబంధించి అన్ని విభాగాలు దెబ్బతిన్నాయి. గేట్లు కూడా పాడయ్యాయి. ప్రధానంగా ఎడమ ప్రధాన కాలువ నుంచి పిల్ల కాలువలకు అనుసంధానంగా ఉండే ఓటీలు, వంతెనలు, షట్టర్లు పూర్తిగా ధ్వంసమయ్యాయి. ఎప్పుడో 45 ఏళ్ల కిందట ఏర్పాటుచేసినవి కావడంతో పూర్తిగా పాడవుతున్నాయి. వాస్తవానికి 2,480 క్యూసెక్కుల నీటి ప్రవాహ సామర్థ్యంతో ఎడమ ప్రధాన కాలువను 1978లో ఏర్పాటుచేశారు. క్రమేపీ లీకులు, పూడిక పేరుకుపోవడం కారణంగా సామర్థ్యం 1800 క్యూసెక్కులకు పడిపోయింది. దీనికితోడు గుర్రపు డెక్క పేరుకుపోయింది. నీటి ప్రవాహానికి అడ్డంకిగా మారింది. అయితే వీటన్నింటిని దృష్టిలో పెట్టుకొని వంశధార అధికారులు 20 టీఎంసీలను లక్ష్యంగా పెట్టుకున్నారు. కానీ దానికి కూడా బ్యారేజీతో పాటు కాలువలు సహకరించే పరిస్థితి కనిపించడం లేదు. దీనికితోడు ఎగువ ప్రాంతాల్లో వర్షాలు కూడా లేవు. దీంతో బ్యారేజీలో నీరు తగ్గుముఖం పడుతోంది. దీంతో రైతుల్లో ఆదిలోనే ఖరీఫ్‌పై బెంగ వెంటాడుతోంది. ముందుచూపు లేకపోవడం వల్లే ఈ పరిస్థితి వచ్చిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇబ్బందులు లేకుండా చేస్తాం..



ఈ ఏడాది ఖరీఫ్‌నకు ఇబ్బంది లేకుండా చూడాలన్నదే మా ధ్యేయం. కానీ ఓటీలు (మదుము)లు వద్ద రాతి కట్టడాలు పాడవుతున్నాయి. దీనికితోడు ఎలుకలు, ఇతర జంతువులు అదే చోట ప్రవేశించి మట్టిని నాశనం చేస్తున్నాయి. అందుకే గండ్లు ఏర్పడుతున్నాయి. యుద్ధ ప్రాతిపదికన పనులు చేపట్టాం. కొన్ని రకాల ఇబ్బందులు ఉన్నా అధిగమించి శివారు ఆయకట్టుకు సాగునీరు అందిస్తున్నాం. – ఎం.మురళీమోహన్, ఈఈ, వంశధార ప్రాజెక్టు నరసన్నపేట డివిజన్

క్లుప్తంగా

వైద్య శిబిరం ఏర్పాటు



రక్తపరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

టెక్కలి రూరల్: గూడెం పంచాయతీ సన్యాసి నీలాపురంలో బుధవారం వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. 'నీలాపురంలో జ్వరాలు' శీర్షికన సాక్షిలో కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన వైద్య సిబ్బంది గ్రామానికి వెళ్లి బావులు, రోడ్డుకు ఇరువైపులా క్లోరినేషన్ చేయించారు. లింగాలవలస పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ పవన్‌తేజ ఆధ్వర్యంలో మెడికల్ క్యాంపు ఏర్పాటు చేశారు. రక్తపరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

కంప్యూటర్ అకౌంటెన్సీ కోర్సులో శిక్షణ

రణస్థలం: ఎచ్చెర్ల మండల కేంద్రంలోని యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థలో ఈ నెల 23 నుంచి ప్రారంభం కానున్న కంప్యూటర్ అకౌంటెన్సీ కోర్సులో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డైరెక్టర్ ఎస్.రామ్‌జీ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి జిల్లాకు చెందిన పదో తరగతి చదివిన, 19 నుంచి 45 ఏళ్ల బీపీఎల్ కేటగిరి మహిళా అభ్యర్థులు అర్హులని పేర్కొన్నారు. 38 రోజులపాటు నిర్వహించే ఈ శిక్షణలో ఉచిత వసతి, భోజన సౌకర్యాలు కల్పిస్తామని, పూర్తి వివరాలకు 77021 80537 నంబరును సంప్రదించాలని కోరారు.

ఇదేం తీరు..!

- వైద్యారోగ్య శాఖలో బదిలీలపై ఎమ్మెల్యేల అత్యుత్సాహం
- సిఫారసు లేఖల ప్రకారం బదిలీలు చేశారా.. లేదా?
- ఒకవేళ చేయకపోతే ఎందుకు చేయలేదు?
- వివరంగా జాబితాలు పంపాలని ఆదేశం



జిల్లా వైద్యారోగ్య శాఖ కార్యాలయం

అరసవల్లి : కూటమి ప్రభుత్వంలో అధికార పార్టీ ఎమ్మెల్యేల తీరుతో జిల్లా స్థాయి అధికారులు అవస్థలు పడుతున్నారు. పోస్టింగ్‌లకు, బదిలీలకు, ఇతరత్రా పనులకు ఒక్కో ఎమ్మెల్యే తమ ప్రాంతీయులకు అనుకూలంగా సిఫారసు లేఖలు పంపిస్తూ.. ఎలాగైనా చేయాల్సిందే అంటూ పట్టుబడుతున్నారు. తాజాగా జిల్లా వైద్యారోగ్య శాఖలో గ్రామ/వార్డు సచివాలయాల్లో ఏఎన్‌ఎంల బదిలీల ప్రక్రియ జూమ్ విధానంలో వివాదాస్పదంగా జరిగిన సంగతి విదితమే. నేతల ఒత్తిళ్లతో కూడిన సిఫారసు లేఖలు కూడా ఇందుకు ప్రధాన కారణం కాగా.. కార్యాలయంలో ఓ ఇద్దరు కీలక ఉద్యోగుల చేతివాటం మరో కారణమనే ఆరోపణలు వినిపించాయి. మొత్తానికి బదిలీల ప్రక్రియ ఎలాగోలా ముగిసింది. పోస్టింగుల స్థానాలను కేటాయించగా.. చాలావరకు జాయినింగ్‌లు కూడా అయిపోయాయి. ఇప్పుడు మళ్లీ అధికారులకు చేతినిండా పనిపడింది. బదిలీలు చేసిన జాబితాలను తిరగేస్తూ బుధవారం కార్యాలయంలో బిజీబిజీగా కనిపించారు.

జాబితా కోసం...!

గ్రామ/వార్డు సచివాలయాల్లో మొత్తం 605 మందికి బదిలీలు చేశారు. పేరుకు నిబంధనల ప్రకారం చేసామని అధికారులు స్టేట్‌మెంట్లు ఇస్తున్నా.. వాస్తవానికి అందుకు విరుద్ధంగా జరిగాయనేది బహిరంగ సత్యం. బదిలీల ప్రక్రియలో ప్రత్యేకంగా పేర్లతో కూడిన జాబితాలను నేరుగా ఎమ్మెల్యేల సంతకాలతోనే జిల్లా వైద్యారోగ్యశాఖకు పంపించారు. వీరికి మాత్రమే కోరుకున్న స్థానాల్లో బదిలీలు చేయాలని హుకుం జారీ చేశారు. సిఫారసు లేఖల ద్వారా అందిన సుమారు మూడు వందల మందికి పైగా పేర్లలో చాలావరకు ఏఎన్‌ఎంలకు కోరుకున్న స్థానాల్లో బదిలీలు చేశారు. తీరా ఇప్పుడు చూస్తే.. 'అసలు మేం ఇచ్చిన సిఫారసు లేఖల్లో ఎవరెవరికి బదిలీలు చేశారో..' అన్న జాబితాలను తిరిగి ఎమ్మెల్యే కార్యాలయానికి పంపించాలంటూ మౌఖిక ఆదేశాలు రావడంతో జిల్లా వైద్యారోగ్య శాఖాధికారులు అదే పనిలో పడ్డారు. శ్రీకాకుళం ఎమ్మెల్యే 8, ఎచ్చెర్ల ఎమ్మెల్యే 10, ఆమదాలవలస ఎమ్మెల్యే 22, పాతపట్నం, టెక్కలి, ఇచ్ఛాపురం, పలాస నరసన్నపేట తదితర నియోజకవర్గాల ఎమ్మెల్యేలు సైతం నాలుగైదు విడతలుగా సిఫారసుల లేఖలతో బదిలీలు చేయాలని లేఖలు అందాయి. ఈ లేఖల ప్రకారం ఎవరికి చేయలేదో.. చేయకపోవడానికి కారణాలేంటో లిఖితపూర్వకంగా ఎమ్మెల్యేలకు తెలియాలట! ఇదే పనిలో డీఎంహెచ్‌వో కార్యాలయ పరిపాలనావిభాగం, ఎస్టాబ్లిష్మెంట్ విభాగాలు తెగ కష్టపడుతున్నాయి. ఇదీ కూటమి ప్రభుత్వంలో అధికార పార్టీ ఎమ్మెల్యేల తీరు.

4 గంటలు.. నరకం



ముళ్ల పొదల మధ్య నుంచి రైల్వే పట్టాల మీదుగా వెళ్తున్న సైక్లిస్టులు, బాటసారులు

- ఎం.తోటూరు ఎల్‌సీ గేట్‌ను మూసివేసిన రైల్వే అధికారులు
- ఇబ్బందులు పడిన విద్యార్థులు, వాహనచోదకులు



ఎల్‌సీ గేటును మూసివేసిన దృశ్యం



నాలుగు గంటల పాటు గేటు మూసివేస్తున్నట్లు ప్లకార్డు ప్రదర్శిస్తున్న రైల్వే ఉద్యోగి

ఇచ్ఛాపురం రూరల్: ఇచ్ఛాపురం రైల్వే ట్రాక్ మరమ్మతుల నేపథ్యంలో బుధవారం మధ్యాహ్నం 3.30 నుంచి రాత్రి 7.30 గంటల వరకు ఎం.తోటూరు వద్ద రైల్వే గేటును మూసివేశారు. దీంతో వాహనచోదకులు తీవర ఇబ్బందులకు గురయ్యారు. నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగించే ఈ రహదారిలో నాలుగు గంటల పాటు గేటు వేయడంతో అటువైపుగా వెళ్లే స్కూల్, కాలేజీ బస్సులు ఎక్కడికక్కడ నిలిచిపోవడంతో నరకయాతన పడ్డారు. అండర్ పాసేజ్ మొత్తం వర్షం నీటితో మునిగిపోవడంతో సుమారు ఐదు కిలో మీటర్ల దూరంలో ఉన్న బెన్నుగానిపేట, కేదారిపురం గ్రామాలు మీదుగా వాహనాలు రాకపోకలు సాగించాయి. సైకిల్‌పై వెళ్లే వారు, బాటసారులు తప్పని పరిస్థితుల్లో ప్రాణాలకు తెగించి అండర్ పాసేజ్ పక్కనున్న సందులు గుండా రైల్వే పట్టాలపై నుంచి రాకపోకలు సాగించారు. అయితే ముందస్తుగా నాలుగు గంటల పాటు గేట్‌ను మూసివేస్తున్నట్లు రైల్వే అధికారులు బుధవారం ఉదయం నుంచి ఎల్‌సీ గేటు వద్ద ప్లకార్డులు ప్రదర్శించడంతో వాహనచోదకులు మిన్నకుండిపోయారు.

నిరుపేద యువతికి అండగా..



నగదు, వివాహ సామగ్రి అందజేస్తున్న సత్యసాయి సేవా సమితి సభ్యులు

టెక్కలి : టెక్కలిలో సత్యసాయి నిత్యాన్నపూర్ణ సేవా కార్యక్రమంలో పనిచేస్తున్న నిరుపేద వితంతు కొమ్ము జ్యోతి కుమార్తె రవళి వివాహానికి సత్యసాయి సేవా సమితి సభ్యులు తమవంతు సహకారం అందజేశారు. బుధవారం రూ.50 వేల నగదు, పట్టుచీర, పుస్తెలతాడు, వివాహ సామగ్రి అందించారు. సమితి సభ్యులు అన్నపూర్ణ జగదీశ్వరరావు, నాగరాణి, టంకాల నాగరాజు తదితరులు రూ.10 వేలు, మిగిలిన దాతలు రూ.50 వేలు, బెలుసొంటి మధు పట్టుచీర, బంగారు శతమానం సమకూర్చారు. కార్యక్రమంలో యు.భాస్కరరావు, చంటి, ఆర్.ఆదినారాయణ, పి.సూర్యనారాయణ, కె.వేణుగోపాల్, ఎం.ఆదినారాయణ, ఎస్.రాములమ్మ, డిల్లేశ్వరరావు, కోదండరావు, లక్ష్మణరావు, హెచ్.రాజశేఖర్, అప్పారావు, ఎం.తాతయ్య, కె.జగన్మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్ జగన్‌ను కలిసిన జెడ్పీ చైర్‌పర్సన్



కంచిలి: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని ఇచ్ఛాపురం నియోజకవర్గ సమన్వయకర్త, జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ బుధవారం తాడేపల్లిలోని పార్టీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. కృష్ణా జిల్లా జెడ్పీ చైర్‌పర్సన్‌పై ఇటీవల దాడి జరిగిన నేపథ్యంలో ఆమెను పరామర్శించి, అనంతరం జగన్‌ను కలిశారు.

కిడ్నీ బాధితుడికి సాయం



శేఖర్‌కు చెక్ అందిస్తున్న శిష్టకరణ సంఘ నాయకులు

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): నరసన్నపేటలో శిష్టకరణ కులానికి చెందిన రఘుపాత్రుని శేఖర్ కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నాడు. విషయం తెలుసుకున్న శిష్టకరణ సేవా సంఘం ప్రతినిధులు బుధవారం ఓ ప్రైవేటు ఫంక్షన్ హాలులో శేఖర్ భార్య సుజాతకు రూ.82 వేలు సాయం అందించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు డబ్బీరు శ్రీనివాసరావు, నాయకులు ఎస్‌వీడీ మురళి, ఆర్‌వీఎస్ శర్మ, సదాశివుని కృష్ణ, బలివాడ శివప్రసాద్, నందిగాం కైలేశ్వరరావు, మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

ఎడ్యుకేషన్..

పాలిసెట్ తుదివిడత కౌన్సెలింగ్ షెడ్యూల్ విడుదల

రణస్థలం/ఎచ్చెర్ల: పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులకు పాలిటెక్నిక్ డిప్లమో కోర్సుల్లో ప్రవేశాలు కల్పించేందుకు ఏపీ పాలిసెట్-2025 తుది విడత వెబ్ కౌన్సెలింగ్ షెడ్యూల్‌ను ప్రభుత్వం విడుదల చేసిందని శ్రీకాకుళం ప్రభుత్వ పురుషల పాలిటెక్నిక్ కళాశాల ప్రధానాచార్యులు, సహాయ కేంద్రం జిల్లా సమన్వయకర్త కె.నారాయణమూర్తి తెలిపారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. తొలి విడత కౌన్సెలింగ్‌కు హాజరై సీటు పొంది కళాశాలలు, బ్రాంచ్‌లు మారాలనుకునేవారు మళ్లీ వెబ్ ఆప్షన్లు ఇచ్చుకోవచ్చని పేర్కొన్నారు. ఇప్పటి వరకు కౌన్సెలింగ్‌కు హాజరుకాని విద్యార్థులు ప్రోసెసింగ్ ఫీజు ఈ నెల 17 నుంచి 19వ తేదీ వరకు చెల్లించవచ్చని తెలిపారు. ఈ నెల 18 నుంచి 20 వరకూ సహాయ కేంద్రంలో ధ్రువపత్రాల పరిశీలన చేయించుకోవాలన్నారు. ఈ నెల 21న సీట్ల కేటాయింపు జాబితా విడుదలవుతుందని పేర్కొన్నారు. విద్యార్థులు ఈ నెల 24 నుంచి 26లోగా ఆయా కళాశాలల్లో రిపోర్టు చేయాలని సూచించారు.

ఈసెట్ తుదివిడత కౌన్సెలింగ్ షెడ్యూల్ విడుదల

రణస్థలం: పాలిటెక్నిక్ డిప్లమో ఉత్తీర్ణులైన విద్యార్థులకు ఇంజినీరింగ్ ద్వితీయ సంవత్సరంలో ప్రవేశాలు కల్పించేందుకు ఏపీ ఈసెట్-2025 తుది విడత కౌన్సెలింగ్ షెడ్యూల్‌ను ప్రభుత్వం విడుదల చేసిందని శ్రీకాకుళం ప్రభుత్వ పురుషల పాలిటెక్నిక్ కళాశాల ప్రధానాచార్యుడు, సహాయ కేంద్రం జిల్లా సమన్వయకర్త కె.నారాయణరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. తొలి విడతలో సీటు పొంది మళ్లీ కళాశాల మారాలనుకునే విద్యార్థులు వెబ్ ఆప్షన్లు ఇచ్చుకోవచ్చని పేర్కొన్నారు. ఇప్పటి వరకు కౌన్సెలింగ్‌కు హాజరుకాని వారు ప్రోసెసింగ్ ఫీజు చెల్లించి ఆన్‌లైన్‌లో ధ్రువపత్రాల పరిశీలన చేయాలన్నారు. ఈ నెల 18, 19 తేదీల్లో ఆన్‌లైన్‌లో ప్రోసెసింగ్ ఫీజు చెల్లించి ధ్రువపత్రాలు పరిశీలనకు అప్‌లోడ్ చేసుకోవాలన్నారు. ఈ నెల 18 నుంచి 20వ తేది వరకు కళాశాలల ఎంపికకు వెబ్ ఆప్షన్లు ఇచ్చుకోవాలని సూచించారు. ఈ నెల 21న ఆప్షన్ల మార్పుకు అవకాశం ఉందన్నారు. ఈ నెల 22న సీట్ల కేటాయింపు జాబితా విడుదల అవుతుందన్నారు. 23 నుంచి తరగతులు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు.

పాలిటెక్నిక్ సెకెండియర్‌లో స్పాట్ అడ్మిషన్లు

రణస్థలం: ఇంటర్మీడియట్ ఒకేషనల్ గ్రూప్‌లో ఉత్తీర్ణులైన విద్యార్థులు ప్రభుత్వ, ప్రయివేటు పాలిటెక్నిక్ కళాశాలల్లో డిప్లమో రెండో ఏడాదిలో ప్రవేశాలు కల్పించేందుకు ఈ నెల 19న శ్రీకాకుళం ప్రభుత్వ పురుషల పాలిటెక్నిక్ కళాశాలలో తక్షణ ప్రవేశాలు నిర్వహిస్తున్నట్లు ప్రధానాచార్యులు, సహాయ కేంద్రం జిల్లా సమన్వయకర్త కె.నారాయణరావు ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కారుణ్య నియామకాలకు కౌన్సెలింగ్



కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న జేసీ

శ్రీకాకుళం పాతబస్టాండ్: కారుణ్య నియామకం ద్వారా ఉద్యోగాలు పొందుతున్న వారు సమర్థంగా బాధ్యతలు నిర్వర్తించాలని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ అన్నారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వివిధ ప్రభుత్వ శాఖల్లో విధి నిర్వహణలో ఉంటూ మృతి చెందిన వారి కుటుంబ వారసులకు కారుణ్య నియామకాల కౌన్సెలింగ్ చేపట్టారు. 42 మంది అభ్యర్థులు హాజరుకాగా రోస్టర్, రిజర్వేషన్, ఇతర అంశాలను పరిగణనలోకి తీసుకొని 32 మందికి నియామక పత్రాలు అందజేశారు. వీరిలో 24 మంది టైపిస్టులు, ఐదుగురు జూనియర్ అసిస్టెంట్లు, ముగ్గురు ఆఫీస్ సబార్డినేట్లు ఉన్నారు. కార్యక్రమంలో డీఆర్‌వో ఎం.వెంకటేశ్వరరావు, కలెక్టరేట్ ఏఓ ఎం.వి.సూర్యనారాయణ, డీటీ ఢిల్లేశ్వరరావు, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ గేమ్స్‌లో నష్టపోయి వ్యక్తి ఆత్మహత్య



మజ్జి బుజ్జి(ఫైల్)

హిరమండలం: గులుమూరు గ్రామానికి చెందిన మజ్జి బుజ్జి (40)గడ్డిమందు తాగి బుధవారం మృతి చెందాడు. హిరమండలం ఎస్సై ఎండీ యాసీన్ తెలిపిన వివరాల ప్రకారం.. బుజ్జి హిరమండలంలోని టాటా ప్లాంట్‌లో సూపర్‌వైజర్‌గా పని చేస్తుండేవాడు. ఆన్‌లైన్ గేమ్స్‌లో నష్టపోయి అప్పుల పాలయ్యాడు. మానసిక ఒత్తిడికి గురై మనస్థాపం చెంది మంగళవారం గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. వెంటనే కుటుంబ సభ్యులు శ్రీకాకుళంలో ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. భార్య భాగ్యలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై కేసు నమోదు చేశారు.

సారా ప్యాకెట్లు స్వాధీనం

కంచిలి: అరవ సరియాపల్లి గ్రామానికి చెందిన బొండాడ మోహిని అనే మహిళ నాటుసారా అమ్ముతున్నట్లు వచ్చిన సమాచారం మేరకు సోంపేట ఎక్సైజ్ సీఐ జి.వి.రమణ సిబ్బందితో కలిసి బుధవారం దాడులు నిర్వహించారు. ఆ సమయంలో ఆమె 80 సారా ప్యాకెట్లను విడిచిపెట్టి పారిపోయింది. వాటిని స్వాధీనపర్చుకొని మహిళపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మూడు, అంతకంటే ఎక్కువ కేసులు ఉంటే వారిపై పి.డి.యాక్టు పెట్టేందుకు ప్రయత్నాలు చేస్తున్నామని చెప్పారు. ఈ దాడుల్లో సీఐతో పాటు కానిస్టేబుళ్లు మార్కారావు, భానుప్రసాద్, ఉమాపతి పాల్గొన్నారు.

నిర్లక్ష్యమే ప్రాణం తీసింది

అరసవల్లి: కుక్క కాటు వేసినా నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్లే మురపాకలో 24 ఏళ్ల కుర్రాడు మృతిచెందినట్లు డీఎంహెచ్‌ఓ డాక్టర్ అనిత బుధవారం తెలిపారు. ఏప్రిల్ 18న కుక్క కాటుకు గురైతే వ్యాక్సిన్ వేసుకోకుండా నిర్లక్ష్యం వహించాడని పేర్కొన్నారు. ఎవరైనా కుక్కకాటు బారిన పడితే కచ్చితంగా వ్యాక్సిన్ వేయించుకోవాలని స్పష్టం చేశారు. మురపాక పీహెచ్‌సీ ఈ కేసు రిపోర్టు కాలేదన్నారు. జిల్లాలో అన్ని పీహెచ్‌సీల్లో ఏఆర్‌వీ వ్యాక్సిన్లు అందుబాటులో ఉన్నాయని చెప్పారు.

సిక్కోలు వేదికగా రాష్ట్రస్థాయి చెస్‌పోటీలు

శ్రీకాకుళం న్యూకాలనీ: నగరంలోని పీఎన్ కాలనీలో ఉన్న న్యూ సెంట్రల్ స్కూల్ వేదికగా ఈ నెల 20న రాష్ట్రస్థాయి స్కూల్స్ ర్యాంకింగ్ చెస్ పోటీలు జరగనున్నాయని ఆలిండియా చదరంగ సమాఖ్య చెస్ ఇన్ స్కూల్స్ కమిటీ సభ్యుడు సనపల భీమారావు బుధవారం తెలిపారు. వివిధ జిల్లాలకు చెందిన సుమారు 200 మంది విద్యార్థులు పాల్గొనే అవకాశం ఉందన్నారు. జిల్లాలోని అన్ని పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు వారి ప్రావీణ్యతను పరీక్షించుకోవచ్చన్నారు. 6 నుంచి 16 ఏళ్ల బాలబాలికలకు 12 కేటగిరీల్లో పోటీలు జరుగుతాయని వెల్లడించారు. ముందుగా ఏపీచెస్.ఓఆర్జీ వెబ్‌సైట్‌లో పేర్లు నమోదు చేసుకోవాలని. పూర్తి వివరాలకు 9912559735 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

కేబుల్ ఆపరేటర్ల ర్యాలీ నేడు

శ్రీకాకుళం: కేబుల్ ఆపరేటర్ల సమస్యల పరిష్కారం కోరుతూ గురువారం ఉదయం 10 గంటలకు ఏపీ సీఓ జేఏసీ శ్రీకాకుళం ఆధ్వర్యంలో శ్రీకాకుళం ఏడు రోడ్ల కూడలి నుంచి ర్యాలీ నిర్వహిస్తున్నామని సంఘ ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. డీటీహెచ్ కేబుల్ రంగంలో రేట్లు తగ్గుతున్నాయని, కేబుల్ యాజమాన్యం(ఎంఎస్‌ఓలు) మాత్రం రేట్లు పెంచడం సరికాదన్నారు.

బాలింత మృతితో ఆందోళన

శ్రీకాకుళం క్రైమ్ : నగరంలోని ఓ కార్పొరేట్ ఆసుపత్రిలో బుధవారం వేకువఝామున బాలింత చనిపోవడంతో ఆమె కుటుంబీకులు, బంధువులు ఆందోళన చేశారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇచ్ఛాపురం కొత్తపుట్టుగ గ్రామానికి చెందిన నర్తు హైమావతి (25) ఐదారేళ్లుగా పిల్లలు కలగకపోవడంతో శ్రీకాకుళం నగరానికి చెందిన, రాజకీయాల్లో ఉన్న ప్రముఖ వైద్యుడు వద్ద మందులు వాడుతోంది. భర్త విదేశాలకు ఉపాధి నిమిత్తం వెళ్లినా.. పిల్లలు కలగాలనే ఆపేక్షతో గ్రామానికి పలుమార్లు వచ్చి భార్య చికిత్స కోసం నెలకు రూ.50 వేలకు మించి ఖర్చు చేసేవారు. ఈ క్రమంలో ఈ నెల 14న హైమావతి బాబుకు జన్మనిచ్చింది. ఈ నెల 15 సాయంత్రం వరకు హైమావతి బాగానే ఉన్నా.. ఆ తర్వాత ఒక్కసారిగా యూరిన్ ఆగిపోవడంతో ఆరోగ్యం క్షీణించింది. మంగళవారం రాత్రి 11 దాటాక చనిపోయింది. శస్త్రచికిత్స వికటించడం వల్లే ఇలా జరిగిందని.. అయినప్పటికీ వైద్యులు బుధవారం వేకువఝామున చనిపోయినట్లు ధృవీకరించినట్లు బంధువులు ఆరోపించారు. ఈ మేరకు ఆందోళన చేయడంతో వైద్యుడు చర్చలు జరిపి రాజీ చేసుకోవడంతో వివాదం సద్దుమణిగింది. అప్పటికే పోలీసులకు సమాచారమందినా సెటిల్మెంట్ కావడంతో వారూ వెనుదిరగాల్సివచ్చింది.

బైక్‌ల చోరీకి పాల్పడిన నిందితుల అరెస్టు



నిందితులు, దొరికిన వాహనాలతో ఎస్పీ, సిబ్బంది

విజయనగరం క్రైమ్: విజయనగరం వన్‌టౌన్, టూటౌన్ పోలీస్ స్టేషన్‌ల పరిధిలో రాయల్ ఎన్‌ఫీల్డ్ మోటార్ సైకిళ్లను అపహరించిన ఇద్దరు నిందితులను వన్‌టౌన్ పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా వన్‌టౌన్‌లో ఎస్పీ వకుల్ జిందల్ విలేకరుల ముందు ఇద్దరు నిందితులను ప్రవేశ పెట్టారు.ఈ కేసుకు సంబంధించి ఎస్పీ వకుల్ జిందల్ మాట్లాడుతూ విజయనగరంలోని వీటీ అగ్రహారం బీసీ కాలనీకి చెందిన ఉప్పడాల రాము అలియాస్ డీజే, శ్రీకాకుళం జిల్లా ఆమదాలవలస మండలం ముద్దాడపేటకు చెందిన ముద్దాడ నవీన్ అలియాస్ టైసన్ (19)తో కలిసి 11రాయల్ ఎన్‌ఫీల్డ్ మోటార్ సైకిల్స్, 2 యమహా మోటార్ సైకిళ్లను మారు తాళాలతో దొంగిలించారన్నారు. తరచూ విజయనగరం వన్ టౌన్, టూటౌన్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో రాయల్ ఎన్‌ఫీల్డ్ మోటార్ సైకిల్స్ చోరీకి గురవుతున్నాయని ఫిర్యాదులు వస్తున్నాయని వాటికి కారకులైన నిందితులను అరెస్టు చేసేందుకు వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో క్రైమ్ ఎస్సై సురేంద్ర నాయుడు బైక్ దొంగతనాలపై తన సిబ్బందితో నిఘా పెట్టారన్నారు. ఈ క్రమంలోనే వీటీ అగ్రహారం బీసీ కాలనీలో నివాసం ఉంటున్న (ఎ1) ఉప్పడాల రాము అలియాస్ డీజేను అరెస్టు చేశామని తెలిపారు. గతంలో కూడా ఉప్పడాల రాము అలియాస్ డీజేపై బైక్ చోరీలకు పాల్పడినట్లు పలు కేసులున్నాయన్నారు. నిందితుడు రాము ఇటీవల జైలు నుంచి విడుదలైన తరువాత మళ్లీ బైక్ చోరీలకు పాల్పడ్డాడని తెలిపారు. ఎ1 ఉప్పడాల రాము నుంచి 7 మోటార్ సైకిల్స్‌ను, ఎ2 ముద్దాడ నవీన్ నుంచి 6 మోటార్ సైకిళ్లు రికవరీ చేశామని చెప్పారు. రికవరీ చేసిన బైక్‌లను కోర్టు ఆదేశాలతో బాధితులకు తిరిగి అందించేందుకు చర్యలు చేపడతామని ఎస్పీ ఈ సందర్భంగా స్పష్టం చేశారు. ఈ కేసులో క్రియాశీలకంగా వ్యవహరించిన విజయనగరం డీఎస్పీ ఎం.శ్రీనివాసరావు, సీఐ ఆర్వీఆర్కే చౌదరి ఆధ్వర్యంలో పని చేసిన వన్ టౌన్ క్రైమ్ ఎస్సై సురేంద్ర నాయుడు, హెచ్‌సీ ఎ.రమణారావు, కానిస్టేబుల్స్ ఎస్.గౌరీశంకర్, పి.శివశంకర్, టి.శ్రీనివాస్, పి.మంజులను ఎస్పీ వకుల్ జిందల్ అభినందించి, ప్రశంసా పత్రాలను అందజేశారు.